# దేవుడెవరో మనకు తెలియజేయడానికి యేసు కథలను ఉపమానాలను ఉపయోగించాడు

పిల్లలకు బోధించేవారు S7b చదివి అధ్యయనం చేయాలి.

**1. యేసు చెప్పిన కథల ద్వారా దేవున్ని గూర్చి నేర్చుకోవడానికి నీ హృదయాన్ని సిద్ధపర్చుకో.**

"ప్రియమైన తండ్రీ, ఈ లోకానికి సువార్తనందివ్వడానికి యేసును పంపించినందుకు వందనాలు. మీ సందేశం మేము సరిగ్గా అర్థంచేసుకోవడానికి సహాయపడేలా ఆయన చెప్పిన కథలను బట్టి వందనాలు. ఈ అద్భుతమైన కథలను మేము ఇతరులకు చెప్పడానికి సహాయంచేయి".



ఈ ప్రపంచానికి దేవుని సందేశం తెచ్చిన అత్యంత శక్తివంతమైన సందేశకుడు యేసు. తన సందేశం మానవులందరికి చక్కగా అర్థం కావడానికి యదార్థగాథలను మరియు సాధారణ మానవుల దైనందిన జీవితంలో జరిగే సంఘటనల ఆధారంగా ఉపమానాలను చెప్పేవాడు. ఆయన కథలనెందుకు ఉపయోగించే వాడంటే, వాటిని అర్థంచేసుకోవడం, జ్ఞాపకముంచుకోవడం మరియు ఇతరులతో పంచుకోవడం తేలిక. ఆయన చెప్పే కథలలోని సత్యాలు ప్రజలకు ఎంత విలువైనవిగా అనిపించేవంటే వాటిని తమ కుటుంబానికి మరియు స్నేహితులకు అందించేవారు. అందువల్లనే సువార్త యూదులలో త్వరితంగా వ్యాపించింది. యేసు చెప్పిన కథలు మనకు వివరించే కొన్ని సత్యాలు క్రింద ఇవ్వబడ్డాయి.

- దేవుడు చాలాసార్లు ఎంతో ఆశ్చర్యకరమైన విధంగా మర్మయుక్తంగా పనిచేస్తాడు. అయితే ఆ మర్మాలను మొలకెత్తే విత్తనాలు, మొక్కల పెరుగుదలలాంటి అందరూ అర్థం చేసుకొనే సాధారణ విషయాలతో యేసు పోల్చిచెప్పేవాడు.
- బలహీనులనీ ఏ ప్రత్యేకతాలేని వారని మనుషులు భావించే వారిని దేవుడు వాడుకొంటాడు.
- మతపరమైన ప్రసంగాలవలె కాకుండా యేసు సందేశం స్వచ్ఛమైనది మరియు శక్తివంతమైనది.
- దేవుడు మనలను వెదుకుతున్నాడనీ మన పాపాల నుండి రక్షించాలని కోరుకొంటున్నాడని యేసు చెప్పాడు.
- మనం పశ్చాత్తాపపడి యేసునందు విశ్వాసముంచినట్టయితే దేవుడు మనలను రక్షిస్తాడు.
- దేవుడు మనం చేయవలసిన పనిని నిర్దేశిస్తాడు. మనమాయనను సంతోషంగా సేవించాలనుకొంటాడుగాని భయంతోకాదు.
- తనను సేవించేవారికి దేవుడు గొప్ప ప్రతిఫలమిస్తాడు. అలాగే తన్ను తిరస్కరించే వారిని శిక్షిస్తాడు.

తన రాజ్యమును గూర్చిన సత్యాలను వివరించడానికి యేసు ఉపయోగించిన కథలు ఎలాంటివో గ్రహించడానికి క్రింది ఆరు ఉదాహరణలు పరిశీలించండి. ఒక కథను చదవగానే దానినర్థం చేసుకోవడానికి సహాయం చేయమని దేవున్ని కోరండి. ప్రతి కథలోను దేవుడెవరో ఆయన నిన్నేమి చేయమని కోరుతున్నాడో తెలిపే అంశం తప్పకుండా ఉండడం గమనించండి.

ఆవగింజ నుండి మీరేమి నేర్చుకోవాలని దేవుడు కోరుతున్నాడో **మత్తయి 13:31-35**లో చూడండి.

- ఆవగింజ మరియు పులిసిన పిండి దేనిని సూచిస్తున్నాయి?
- దేవుని రాజ్యం ఏ విధంగా ప్రారంభమౌతుంది? అది అభివృద్ధి చెందుతున్నప్పుడు ఏం జరుగుతుంది?

**లూకా 5:36-38**లో పాత చొక్కా మరియు పాత సీసాలను గూర్చిన కథను చూడండి.

- కొత్త మాసిక మరియు కొత్త ద్రాక్షారసం దేనిని సూచిస్తున్నాయి?
- ఇతరుల సందేశాలకు లేదా సనాతన మతపరమైన సందేశాలకు మరియు యేసు సందేశానికి పోలిక ఏమిటి?

**లూకా 15:8-10**లో పోగొట్టుకొన్న నాణెం గూర్చిన కథను చదవండి.

- ఆ స్త్రీ మరియు పోయిన నాణెం దేనిని సూచిస్తున్నాయి?
- నశించిన దానిని వెదకడానికి దేవుడు ఎంత త్వరపడుతున్నాడు? అది లభించినప్పుడు ఆయనేం చేస్తాడు?

**లూకా 18:10-14**లో పశ్చాత్తాపపడిన సుంకపుదారు కథను చదవండి.

- పరిసయ్యుని స్వభావం దేవునికెందుకు ఇష్టం కాలేదు?
- మనం దేవునినెలా సమీపించాలి?

**మత్తయి 24:45-51**లో నమ్మకమైనదాసుని కథను చూడండి.

- నమ్మకమైనదాసుడు ఎవరిని సూచిస్తున్నాడు అతని పని దేనిని సూచిస్తున్నది?
- మనం దేవున్ని ఎటువంటి మనసుతో, ఎటువంటి దృక్పథంతో ఆరాధించాలి?

**మత్తయి 25:1-12**లో పెండ్లి విందును గూర్చిన కథ చదవండి.

- క్రీస్తును నమ్మకంగా సేవించే వారికొరకు ఏమి ఎదురుచూస్తున్నది? అలాగే ఆయనను నమ్మకంగా సేవించని వారికొరకు ఏమి ఎదురుచూస్తున్నది?
- పెళ్ళి విందు దేనిని సూచిస్తున్నది? (ఈ విషయమై మరిన్ని వివరాల కొరకు ప్రకటన 19:1-10 చదవండి)

దేవుని సత్యాన్ని స్పష్టంగా అందరికీ అర్థమయ్యేలా వివరించడానికి మనం కూడ బైబిల్‌లోని పాత మరియు క్రొత్త నిబంధనల నుండి కథలను ఉపయోగించాలి. మనం ఆ కథలను కంఠతా చెప్పవచ్చు లేదా చదవవచ్చు లేదా పద్యరూపంలో చెప్పవచ్చు, పాటలా పాడవచ్చు, నాటికలా ప్రదర్శించవచ్చు లేదా పటాల రూపంలో వివరించవచ్చు.

**2. మీ జతపనివారితో కలసి వారమంతటి కొరకు కార్యక్రమాలను రూపొందించుకోండి.**

- విశ్వాసులను మరియు ఇంకా క్రీస్తునెరుగని వారిని దర్శించండి. వారి అవసరాలకు సరిపోయే కథలను పాత మరియు క్రొత్త నిబంధనల నుండి చెప్పండి. ఆ కథలలో ఉన్న ఆత్మీయ సత్యాలను మీరు మరియ కథలు వినేవారు ఆచరణలో పెట్టడానికి సహాయపడమని దేవున్ని అడగండి.
- పిల్లలకు బోధించే వారిని కలుసుకోండి. యేసు చెప్పిన కథలను మరియు ఇతర బైబిల్ కథలను ఎలా చెప్పాలో వారికి సూచనలివ్వండి. పిల్లలు ఆ కథలను నాటికలవలె ప్రదర్శించవచ్చు లేదా పాటలవలె పాడవచ్చు. వీలైతే ఆ కథలను వివరించే పటాలు గీసి వాటిలో ఇమిడివున్న సత్యాలను గూర్చి కవితలు వ్రాయవచ్చు.
- ఇతరులకు యేసును గూర్చి చెప్పడానికి మరియు బోధించడానికి బైబిల్ కథలను ఎలా ఉపయోగిస్తున్నారో మీ జతపనివారితో చర్చించండి. సువార్తను అర్థం చేసుకోవడానికి మీ సంస్కృతికి సరిపోయే కథలను ఎన్నుకోండి బోధనా పరికరాలను ఉపయోగించి కథలు చెప్పండి.
- తమ స్నేహితులకు బైబిల్ కథలు ఎలా చెప్పాలో మీ సంఘస్థులకు చెప్పండి. ఆరాధన సమయంలో కథలను నాటికల రూపంలో లేదా పాటల రూపంలో ఎలా ప్రదర్శించవచ్చో వారికి చెప్పండి. కళాత్మక అభిరుచి ఉన్న వాళ్ళు కథలను వివరించే పటాలను గీయవచ్చు.

**3. మీ జతపని వారితో కలిసి ఆరాధన సమయం కొరకు సిద్దపడండి.**

ప్రస్తుత అవసరాలు మరియు స్థానిక ఆచారాలకు తగిన కార్యక్రమాలు ఎన్నుకోండి.

యేసు చెప్పిన ఉపమానాల నుండి ఒకటి లేదా కొన్ని ఉపమానాలను వివరించండి లేదా రూపకమువలె ప్రదర్శించండి.

ఈ పాఠం మొదటి భాగంలో ఇవ్వబడిన ప్రశ్నలడగండి.

యేసు చెప్పిన కథలలో దేవున్ని గూర్చిన సత్యాలు ఏ విధంగా బయలుపర్చాడో వివరించండి. వాటిలో కొన్ని సత్యాలను **వివరించండి.**

**ప్రభురాత్రి భోజనం** పరిచయం చేయడానికి యేసు మత్తయి 25:1–13లో చెప్పిన పెండ్లి విందుకు వెళ్ళిన బుద్ధిగల కన్యకలు మరియు బుద్ధిలేని కన్యకల కథను ఉపయోగించండి. మనకు పరలోకంలో లభించే ప్రతిఫలంగా యేసుతో కూడ మనం పాల్గొనబోయే గొప్ప పెండ్లి విందును ప్రభురాత్రి భోజనం ముందుగానే రుచి చూపిస్తుందని వివరించండి.

**పిల్లలు** తాము సిద్ధపర్చుకొన్న నాటికను ప్రదర్శించేలా చూడండి. వారు వ్రాసిన కవితలు చదవవచ్చు లేదా ప్రశ్నలడగవచ్చు.

దేవుని గూర్చిన సత్యాలను గ్రహించడానికి మరియు సువార్తను ఇతరులకు అందించడానికి బైబిల్ కథలు తమకెలా సహాయపడ్డాయో వివరిస్తూ కొంత మంది విశ్వాసులు సాక్ష్యమివ్వాలి.

ఇద్దరు ముగ్గురు కలిసి ఒక గుంపుగా ఏర్పడి ప్రార్థించండి. ఒకరికొకరు సలహాలనిచ్చుకోండి మరియు యేసు చెప్పిన కథలను ఏ విధంగా నేర్చుకోవాలో వాటిని స్నేహితులకు, కుటుంబానికి ఏ విధంగా అందించాలో ప్రణాళికలు తయారు చేసుకోండి.

**కంఠతా వాక్యం :** అందరూ కలిసి యోహాను 8:12 కంఠస్థం చేయండి.

Copyright © 2004 by Paul-Timothy. May be freely copied. Download from www.Paul-Timothy.net